క్లుప్తంగా

హుండీ ఆదాయం రూ.1.10 లక్షలు


శివాలయంలో హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న అర్చకులు

పెదవేగి : మండల కేంద్రమైన పెదవేగిలోని పార్వతీ సమేత పరమేశ్వర స్వామి ఆలయ హుండీ ఆదాయం ఏడాది కాలానికి రూ.1,10,341 లభించిందని ఆలయ ప్రధాన అర్చకులు సుబ్రమణ్య శర్మ మంగళవారం తెలిపారు. గతేడాది ఫిబ్రవరి 22న హుండీ ఆదాయం లెక్కించామన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ కె.శ్రీనివాస్, దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ బీఎల్ నరసింహారావు, ఆలయ కమిటీ చైర్మన్ తాత రాంబాబు, కె.రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

19 మంది బైండోవర్

దెందులూరు: ఎన్నికలకు సంబంధించి మంగళవారం తహసీల్దార్ కోర్టులో 19 మందిని బైండోవర్ చేశామని ఎస్సై కె.స్వామి తెలిపారు. వీరి నుంచి మేజిస్ట్రేట్ ఆదేశాల మేరకు పూచీకత్తు తీసుకుని పంపించామన్నారు. మండలంలో నేర చరిత్ర ఉన్న వారు, రౌడీషీటర్లు, కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచామని ఎస్సై తెలిపారు.

ట్రాఫిక్ ఎస్సై కేశవరావుకు సేవా పతకం


జి.కేశవరావు

ఏలూరు (టూటౌన్): కృష్ణాజిల్లా గన్నవరం ట్రాఫిక్ ఎస్సైగా ఇటీవల బదిలీపై వెళ్లిన జి.కేశవరావు ఉగాది పండుగ పురస్కరించుకుని ఉత్తమ సేవా పతకానికి ఎంపికయ్యారు. గొరిపర్తి కేశవరావు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 1987లో కానిస్టేబుల్‌గా పోలీస్ శాఖలో చేరారు. 2010లో హెడ్ కానిస్టేబుల్‌గా, 2013లో ఏఎస్ఐగా, 2021లో ఎస్సైగా పదోన్నతి పొందారు. నరసాపురం టౌన్, డొకరాయ్, తాడేపల్లిగూడెం టౌన్, ఉండి, జంగారెడ్డిగూడెం, ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్, డీసీఆర్‌బీ, డీస్పీ, పెదవేగి జిల్లా పోలీస్ ట్రెనింగ్ సెంటర్లలో ఉద్యోగ నిర్వహణలో పలు రివార్డు, అవార్డులు, నగదు పురస్కారాలు అందుకున్నారు. ఏలూరు జిల్లా కేంద్రంలో పోలీస్ పీఆర్ఓగా సమర్థవంతంగా పనిచేసి పోలీస్ ఉన్నతాధికారుల మన్ననలు పొందారు. ప్రస్తుతం ఆయన ఏలూరు జిల్లా నుంచి గన్నవరం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. సేవాపతకానికి ఎంపిక కావడం పట్ల కేశవరావుకు పలువురు పోలీస్ అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

నేటి నుంచి తిరుకల్యాణ మహోత్సవాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక అగ్రహారం జనార్ధన, రంగనాయక స్వామివార్ల దేవస్థానంలో బుధవారం నుంచి ఈనెల 26 వరకు తిరుకల్యాణ మహోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్టు దేవస్థానం కార్యనిర్వహణాధికారి గుబ్బల రామ పెద్దింట్లరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉత్సవాల్లోభాగంగా ప్రతి రోజూ ఉదయం జనార్ధన స్వామి సుప్రభాత సేవ, నిత్యార్చన, సేవాకాలం, ఆరగింపు కార్యక్రమాలు, సాయంత్రం అర్చన, హోమాలు, సేవాకాలం, ఆరగింపు, రాత్రి మంగళాశాసనం, తీర్థ ప్రసాద వినియోగం ఉంటుందని వివరించారు. 20న శ్రీవారికి, తాయార్లకు క్షీర తిరుమంజనం, స్వామివార్లను పెండ్లి కుమారులను, తాయార్లను పెండ్లి కమార్తెలను చేస్తారని, రాత్రి అర్చన, అంకురార్పణ, దీక్షధారణ, హోమాదులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. 21న ఉదయం ధ్వజారోహణం, సాయంత్రం హోమాదులు, 23న స్వామి వార్ల తిరు కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు. 24న ఉదయం రాజ్యలక్ష్మీ తాయార్లకు 108 కలశ క్షీర తిరుమంజనం, సాయంత్రం స్వామి వార్ల రథోత్సవం వైభవంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. 25వ తేదీ ఉదయం ఉత్సవ పూర్ణాహుతి, ధ్వజావరోహణం, సాయంత్రం రాజ్యలక్ష్మీ తాయార్లకు లక్ష మల్లెల అర్చన, 26న శ్రీస్వామి, తాయార్లకు పవళింపు సేవ ఉంటాయని తెలిపారు.

సమాజాభివృద్ధికి యువత చొరవ చూపాలి

లింగపాలెం: సమాజంలోని రుగ్మతలను రూపుమాపడానికి ఆధ్యాత్మిక కేంద్రాలైన దేవాలయాలు దోహదపడుతాయని ఏలూరు బిషప్ పొలిమేర జయరావు అన్నారు. మంగళవారం లింగపాలెం మండలం పాశ్చానగరం విచారణలో పునీత జోజప్ప మహోత్సవాల ముగింపు కార్యక్రమంలో జయరావు పాల్గొని దివ్యబలిపూజ సమర్పించి ప్రత్యేక పూజ చేశారు. అనంతరం జయరావు మాట్లాడుతూ క్రీస్తు చూపించిన ప్రేమను ఇతరులకు పంచి సోదర భావంతో కలసిమెలసి జీవించాలన్నారు. తోటివారి పట్ల దయ, క్షమాగుణం కలిగి ఉండాలన్నారు. సమాజాభివృద్ధికి అంకితభావంతో పనిచేసేందుకు యువత చొరవ చూపాలన్నారు. పాపరక్షకుడు క్రీస్తు మార్గంలో ప్రతి ఒక్కరూ పయనించాలన్నారు. ఈమేరకు సంఘస్తులు, ఫాదర్లు, పాస్టర్లు బిషప్ జయరావును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక విచారణ ఫాదర్ హెచ్ ఏసురత్నం, సహాయక గురువులు, సిస్టర్లు, పలు విచారణలకు చెందిన ఫాదర్లు, సంఘ పెద్దలు, విశ్వాసులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల ప్రయోజనమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు


గణపవరం క్షత్రియ ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసుబాబు

గణపవరం: రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రయోజనాల కోసం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. మంగళవారం రాత్రి గణపవరంలో నిర్వహించిన క్షత్రియ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. బీసీ కులాలకు ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేసినట్లే అగ్రవర్గాల పేదలను ఆదుకోవడానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి వారి అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేసిందని వివరించారు ఇందులో భాగంగా క్షత్రియ కార్పొరేషన్ ఏర్పాటు చేసి క్షత్రియుల్లో పేదల సంక్షేమానికి కృషి చేసిందని చెప్పారు. రాజకీయంగా చైతన్యవంతులైన క్షత్రియులు రానున్న ఎన్నికల్లో అభివృద్ధి, సంక్షేమానికి మద్దతుగా నిలవాలని కోరారు. ఆక్వా రంగం అభివృద్ధిలో క్షత్రియుల పాత్ర కీలకమన్నారు. ఆక్వా రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని తెలిపారు. రూ.1.50కే యూనిట్ విద్యుత్ సబ్సిడీపై అందిస్తున్నట్టు చెప్పారు. ఆక్వాజోన్ ఏర్పాటుచేసి ఆక్వా అభివృద్ధికి సహకరిస్తోందన్నారు. ఆక్వా రైతులకు మేలు కలిగేలా ప్రతి నియోజకవర్గంలోనూ ఆక్వా లాబొరేటరీలు ఏర్పాటు చేసిందని తెలిపారు. ఆక్వా రైతులకు మద్దతు ధర ప్రకటించి, ఆ ధరలకే వ్యాపారులు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుందని అన్నారు. రానున్న రోజుల్లో ఆక్వా రంగానికి మరింత మేలు చేసే కార్యక్రమాలు చేపడుతుందని చెప్పారు. పలువురు క్షత్రియ సంఘం నాయకులు మాట్లాడుతూ రాజకీయంగా క్షత్రియులకు తగిన గుర్తింపు ఇచ్చిన వైఎస్సార్ సీపీకే తమ మద్దతు ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో క్షత్రియ నేతలు దండు రాము, సరిపల్లె చిన్న, పెన్మెత్స రవిరాజు, రుద్రరాజు సుబ్బరాజు, నడింపల్లి సోమరాజు, చింతలపాటి రామకృష్ణంరాజు, కూసంపూడి జగపతి రాజు, గాదిరాజు అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దింట్లమ్మ సేవలో ఎమ్మెల్యే వాసుబాబు


పెద్దింట్లమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే వాసుబాబు

ఉంగుటూరు: అప్పారావుపేట గ్రామంలో పెద్దింట్లమ్మవారి వార్షిక మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం అక్కడ నిర్వహించిన అన్నసమారాధన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సింగిరెడ్డి సూర్యనారాయణ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మరడ మంగరావు, పార్టీ నాయకుడు పాత్తూరి శ్రీనివాసరాజు, బళ్ల త్రిమూర్తులు పాల్గొన్నారు.

గ్రామాల్లో 'నేను సిద్ధం.. మా ఊరు సిద్ధం'

పెదపాడు : మండలంలోని పెదపాడు, అప్పనవీడు గ్రామాల్లో నేను సిద్ధం.. మా ఊరు సిద్ధం కార్యక్రమం నిర్వహించారు. అప్పనవీడులో మండల కన్వీనర్ అప్పన ప్రసాద్ స్థానిక నాయకులతో కలిసి ఇంటింటా తిరిగి సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో అప్పనవీడు గ్రామ సర్పంచ్ చిన్నాల ఝాన్సీ ఎంపీటీసీ బుద్ధే రామసీత, వలీ పాల్గొన్నారు.

- పెదపాడు గ్రామంలోని తెలగాల పేటలో మంగళవారం నేను సిద్ధం.. మా ఊరు సిద్ధం కార్యక్రమం పెదపాడు సొసైటీ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్ నేతృత్వంలో నిర్వహించారు. ముఖ్యమంత్రి అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కర్రె మరియమ్మ, వైస్ ఎంపీపీ రెడ్డి స్వర్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓలకు ఎఫ్‌టీఏ

దెందులూరు: ఎంఈఓలకు రాష్ట్ర ప్రభుత్వం ఫిక్స్‌డ్ ట్రావెల్స్ అలవెన్స్ మంజూరు చేస్తూ విద్యాశాఖ డైరెక్టర్ పయ్యావుల పార్వతి మంగళవారం లిఖిత పూర్వక ఆదేశాలు జారీ చేశారు. పాఠశాలల పర్యవేక్షణ నిమిత్తం నెలకు రూ.వెయ్యి చొప్పున ఎంఈఓ-1లకు సమానంగా ఎంఈఓ-2లకు ఫిక్స్‌డ్ ట్రావెల్స్ అలవెన్స్ మంజూరు చేయడంపట్ల దెందులూరు ఎంఈఓ-2 అన్నమ్మ హర్షం వ్యక్తం చేశారు.

ఎన్నికల కోడ్‌ను పక్కాగా అమలు చేయాలి


హెచ్‌ఎంల సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ-1 ఈదుపల్లి శ్రీనివాసరావు

భీమడోలు: ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాఠశాలల్లో పక్కాగా అమలుచేయాల్సిన బాధ్యత ప్రధానోపాధ్యాయులపై ఉందని భీమడోలు ఎంఈఓ ఈదుపల్లి శ్రీనివాసరావు అన్నారు. భీమడోలు మండల విద్యావనరుల కేంద్రంలో మంగళవారం ఎన్నికల నియమ నిబంధనలు, అకడమిక్ అంశాలు, సిలబస్ పూర్తి చేయడం, నాడు నేడు, ఇంట్రాక్టివ్ ప్యానెల్స్, స్మార్ట్ టీవీ వినియోగం తదితర అంశాలపై హెచ్‌ఎంలతో ఎంఈఓ-1 ఈదుపల్లి శ్రీనివాసరావు, ఎంఈఓ-2 అయినపర్తి భాస్కర్‌లు సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అనుసరించి విద్యా కార్యక్రమాలను అమలు చేయాలని సూచించారు. మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్‌కు వ్యతిరేకంగా వ్యవహరిస్తే ఎన్నికల సంఘం చర్యలకు బాధ్యులవుతారని హెచ్చరించారు. పాఠశాలల్లోని పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలన్నారు. నాడు నేడు పథకం పనులు నిబంధనలను అనుసరించి చేపట్టాలని సూచించారు. పాఠశాలల్లో టీచర్లు సిలబస్ పూర్తి చేయడంతో పాటు, వచ్చే నెలలో నిర్వహించే సమ్మేటివ్ 2, టోఫెల్ పరీక్షలకు విద్యార్థులను సంసిద్ధులను చేయాలని అన్నారు. స్మార్ట్ టీవీ, ఇంటాక్టివ్ ఫ్లాట్ ఫ్యానెల్స్ వినియోగంపై చిన్నారులకు చక్కని తర్ఫీదు ఇవ్వాలని ఆదేశించారు.

జాతీయ స్థాయి ర్యాంకర్లకు అభినందనలు


ర్యాంకర్లను అభినందిస్తున్న ఎంఈఓ శ్రీనివాసరావు

భీమడోలు: జాతీయ స్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థినీ విద్యార్థులను ఎంఈఓ-1 ఈదుపల్లి శ్రీనివాసరావు మంగళవారం అభినందించారు. నేషనల్ స్థాయి టాలెంట్ టెస్టుల్లో పూళ్ల పాఠశాలకు చెందిన కర్రి స్నేహ సాయి వర్షితరెడ్డి 10వ ర్యాంకు, గుండుమోలు లాస్యశ్రీజశ్రీ, కల్లి అక్షయ కీర్తిలకు 11వ ర్యాంకు, యాగంటి సాత్విక్ 22వ ర్యాంకులు వచ్చాయి. ఈ నేపథ్యంలో పాఠశాలను సందర్శించిన ఎంఈఓ ఈదుపల్లి శ్రీనివాసరావు ఆ విద్యార్థులను, ఉపాధ్యాయులను అభినందించారు. వారికి ఉత్తమ ప్రతిభా పత్రాలను అందజేశారు. విద్యార్థి దశ నుంచి చిన్నారులు తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శించి ఉన్నత లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. విద్యార్థి దశ ప్రతి ఒక్కరికీ కీలకమన్నారు. జాతీయ స్థాయి ర్యాంకులను సాధించడం వారి ప్రతిభకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ జీవీ గిరిధర్, టీచర్లు పాల్గొన్నారు.

కోరుకల్లులో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం


వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యులు, సిబ్బంది

భీమడోలు: ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమంలో భాగంగా కోరుకల్లు గ్రామంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ పంచాయతీ పరిధిలో 325 మందికి వైద్యులు కంటి, రక్త, ఇతర పరీక్షలు, ఈసీజీలు చేశారు. ఉచితంగా మందులు అందజేశారు. నలుగురికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యవంతులు ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. గుండుగొలను వైద్యాధికారిణి కె.శ్రీలక్ష్మి, చిన్నపిల్లల వైద్యులు కిషోర్, ఎముకల వైద్య నిపుణులు సీహెచ్ శివకుమార్, వైద్యులు వెంకటరెడ్డి తదితరులు ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ సిబ్బంది, సూపర్‌వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

హిందీ పరీక్షకు 73 మంది గైర్హాజరు


పరీక్ష రాస్తున్న పదో తరగతి విద్యార్థులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): పదో తరగతి హిందీ పరీక్షకు మంగళవారం ఏలూరు నియోజకవర్గంలోని 20 కేంద్రాల్లో 4,303 మంది విద్యార్థులను 4,230 మంది పరీక్ష రాయగా, 73 మంది గైర్హాజరయ్యారు. అలాగే ప్రైవేట్ విద్యార్థులు 170 మందికి 61 మంది పరీక్షకు హాజరు కాగా 109 మంది గైర్హాజరయ్యారు. ఏలూరు రూరల్ చాటపర్రు హైస్కూల్‌లో 244 మందికి 221 మంది, ప్రైవేటు విద్యార్థులు 10 మందికి ఐదుగురు, సత్రంపాడు హైస్కూల్‌లో 290 మందికి 285, శనివారపుపేట హైస్కూల్‌లో 237 మందికి 229, ప్రైవేటు విద్యార్థులు 17 మందికి ముగ్గురు, గవరవరం శ్రీ చైతన్య స్కూల్‌లో ప్రైవేట్ అభ్యర్థులు 40 మందికి 15 మంది హాజరయ్యారు. ఏలూరు అర్బన్ పరిధిలో సెయింట్ థెరిస్సా పాఠశాలలో 300 మందికి 297, కేపీడీటీ హైస్కూల్‌లో 239 మందికి 234, సుబ్బమ్మదేవి హైస్కూల్‌లో 299 మందికి 294, సురేష్ చంద్ర బహుగుణ పోలీస్ స్కూల్‌లో 300 మందికి 298 మంది హాజరయ్యారు. కేకేఆర్ గౌతం స్కూల్‌లో 240 మందికి 232 మంది, రవీంద్రభారతి స్కూల్‌లో 193 మందికి 188, ఏఆర్‌డీజీకే హైస్కూల్‌లో 230 మందికి 230, కస్తూరిబా బాలికోన్నత పాఠశాలలో 338 మందికి 336 మంది హాజరయ్యారు. గాంధీనగర్ మున్సిపల్ హైస్కూల్‌లో 320 మందికి 315, తూర్పువీధి శ్రీ కృష్ణ దేవరాయ మున్సిపల్ హైస్కూల్‌లో 289 మందికి 289, జేఎంజే ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో 240 మందికి 239, అమలోద్భవి హైస్కూల్‌లో 340 మందికి 339, నారాయణ హైస్కూల్‌లో 204 మందికి 204, బాల గంగాధర్ తిలక్ స్కూల్‌లో ప్రైవేట్ అభ్యర్థులు 34 మందికి 17, ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ప్రైవేట్ అభ్యర్థులు 32 మందికి 11 మంది, న్యూజనరేష్ స్కూల్లో ప్రైవేటు విద్యార్థులు 37 మందికి 10 మంది హాజరయ్యారు.

గర్భిణులకు పోషకాహారం అవసరం


కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీఓ పద్మావతి

ఏలూరు (టూటౌన్): గర్భిణులకు పోషకాహారం ఎంతో అవసరమని ఏలూరు అర్బన్ ప్రాజెక్టు సీడీపీఓ ఎ.పద్మావతి అన్నారు. పోషణ పక్వాడా పక్షోత్సవాల్లో భాగంగా స్థానిక రెహమద్ నగర్, జయప్రకాష్ సెంటర్, కొత్తపేట-1, చోడిదిబ్బ పెద్దింటి వారి వీధి అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ఉన్న గర్భిణులకు ప్రత్యేక యోగ తరగతులను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ పద్మావతి గర్భిణులకు పౌష్టికాహార ప్రాధాన్యతను వివరించారు. గర్భిణులకు శారీరక, మానసిక ప్రశాంతత ఎంతో అవసరమని అన్నారు. తగిన విశ్రాంతి తీసుకోవాలన్నారు. అర్బన్ హెల్త్ సెంటర్ డాక్టర్ శశాంక్ మాట్లాడుతూ తీసుకునే ఆహారంతో పాటు వేళకు మందులు వేసుకోవడంలో గర్భిణులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమలో ఎంఎస్‌కేకేవీఎస్ నాగమణి, ఏఎన్ఎం దుర్గ, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎం.నవతి, కె.ఝాన్సీ లక్ష్మి, షామిమా, డి.నాగదేవి, డీఎస్‌డీ భవాని, ఆశావర్కర్ డి.మణి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా సంక్షేమం అందించిన జగన్

జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ


సత్యవోలులో పథకాలపై ప్రచారం చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ప్రసాదరావు

పెదపాడు : ఇంటింటా సంక్షేమంతో పాటు అభివృద్ధి చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. పెదపాడు మండలం సత్యవోలు గ్రామంలో సంక్షేమ పథకాలపై ప్రచారం చేశారు. ఈ సందర్భంగా పద్మశ్రీ మాట్లాడుతూ గత ప్రభుత్వానికి ప్రస్తుత ప్రభుత్వానికి గల వ్యత్యాసాన్ని బేరీజు వేసుకోవాలని సూచించారు. దెందులూరు నియోజకవర్గంలో గత ఎమ్మెల్యే చేసిన అభివృద్ధికి ప్రస్తుతం చేసిన అభివృద్ధికి ఉన్న తేడాను వివరించారు. సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలు కావాలంటే రెండోసారి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. అమ్మ ఒడి, వసతి దీవెన, విద్యాదీవెన, విద్యాకానుక, చేయూత, ఆసరా, కాపునేస్తం, ఓబీసీ నేస్తం వృద్ధులకు వృద్ధాప్య పింఛను, వికలాంగులకు రూ.3 వేల పింఛను అందిస్తున్నామని చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన మేనిఫెస్టోలో 99 శాతం పూర్తిచేశామని వివరించారు. మేనిఫెస్టోలో లేకపోయినా.. ప్రజావసరాలకు అనుగుణంగా అనేక పథకాలను రూపొందించి అమలు చేసిచూపిన ఏకైక సీఎం జగన్ అని కొనియాడారు. కార్యక్రమంలో సత్యవోలు, సకలకొత్తపల్లి గ్రామ సర్పంచ్‌లు రంభ ఉమామహేశ్వరరావు, చేపేని రంగారావు, సొంగల మహేశ్వరరావు, ఉపసర్పంచ్ పెంకి శ్రీనివాసరావు, కొట్నాని వెంకట్రావు, కునుకు వెంకట్రావు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణం

దెందులూరు: పదో తరగతి పరీక్షల నేపథ్యంలో విద్యార్థులు ఈనెల 30 వరకు పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగుల్లో హాల్ టిక్కెట్ చూపించి ఉచితంగా ప్రయాణం చేయవచ్చునని ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ఏలూరు డిపో జోనల్ కార్యదర్శి ఏవీ రావు, డిపో సెక్రటరి కె.బాబురావు, ట్రెజరర్ సునాథ్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కల్పించిన ఈ సౌకర్యాన్ని విద్యార్థులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అన్నదానం

పెదపాడు : మండలంలోని అప్పనవీడులోని అభయాంజనేయస్వామి దేవస్థానంలో మంగళవారం పురష్కరించుకుని 200 మందికి అన్నదానం చేశారు. రేమల్లె వాస్తవ్యులు మూల్పూరి రాజేంద్ర ప్రసాద్ జ్ఞాపకార్థం వారి కుటుంబీకులు ఆర్థిక సాయం అందించారు. తొలుత స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ఈఓ కూచిపూడి శ్రీనివాస్ అర్చకులు పాల్గొన్నారు.

నేడు రామాలయంలో విగ్రహాల ప్రతిష్ఠ

దెందులూరు: మండలంలోని సోమవరప్పాడు కోదండ రామాలయంలో విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవం బుధవారం నిర్వహించనున్నట్టు వైస్ ఎంపీపీ వేమూరి జితేంద్ర, గ్రామ సర్పంచ్ సరిగే నాగరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి పాల్గొంటారని భక్తులంతా హాజరై స్వామివారి ఆశీస్సులు పొందాలని వారు కోరారు.

టెన్త్ పరీక్షకు 23 మంది గైర్హాజరు

ఉంగుటూరు: పదో తరగతి హిందీ పరీక్షకు మండలంలో 711 మంది విద్యార్థులకు 23 మంది గైర్హాజరయ్యారని ఎంఈఓ-2 శ్రీనివాసరావు తెలిపారు. 688 మంది పరీక్షలు రాశారని పేర్కొన్నారు. ప్రైవేటు విద్యార్థులు 50 మందికి 26 మంది హాజరయ్యారని, 24 మంది హజరుకాలేదని తెలిపారు.

వైభవంగా సీతారాముల గ్రామోత్సవం


అర్ధవరంలో సీతారామచంద్రుల గ్రామోత్సవంలో పాల్గొన్న భక్తులు

గణపవరం: గణపవరం మండలం అర్ధవరం గ్రామంలో భక్తుల సహకారంతో నిర్మించిన సీతారామాలయంలో విగ్రహ ప్రతిష్ఠామహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. రెండో రోజు మంగళవారం సాయంత్రం సీతారామచంద్రుల గ్రామోత్సవం కనుల పండుగగా నిర్వహించారు. మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారికి పూజలు చేశారు. గ్రామోత్సవం భక్తుల జయజయ ధ్వానాల మధ్య అత్యంత వైభవంగా సాగింది. ఉదయం నుంచి ఆలయం వద్ద గోపూజ, విశ్వక్సేన పూజలు, పంచగవ్యాధివాసం, క్షీరాధివాసం, జలాధివాసం, చతుర్వేద పారాయణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం ఉదయం 10.06 గంటలకు సీతారామచంద్రస్వామి, లక్ష్మణ స్వామి, ఆంజనేయస్వామి విగ్రహప్రతిష్ఠ, శిఖర ప్రతిష్ఠ, ద్వారపాలక సంపూర్ణ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అనంతరం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ పేర్కొంది.

గ్రామాల్లో ఫ్లెక్సీ, బ్యానర్ల తొలగింపు


వడ్లపట్ల రోడ్డులో కటౌట్‌ను తొలగిస్తున్న దృశ్యం

భీమడోలు: ఎన్నికల కోడ్ అమలులో భాగంగా మండలంలోని భీమడోలు, అంబర్‌పేట, పోలసానిపల్లి, కురెళ్లగూడెం గ్రామాల్లోని బహిరంగ ప్రదేశాల్లో ఉన్న రాజకీయ నాయకుల కటౌట్లు, బ్యానర్లు, ఫ్లెక్సీలను సంబంధిత అధికారులు మంగళవారం తొలగింపజేశారు. విగ్రహాలకు ముసుగులు వేయించారు. ఆయా గ్రామాల్లో పర్యటించిన ఎంపీడీఓ టి.స్వర్ణలత, ఎస్సై వై.సుధాకర్‌లు మాట్లాడుతూ బుధవారం నుంచి ఎన్నికల కోడ్‌ను మరింత కట్టుదిట్టంగా అమలు చేస్తామన్నారు. రాజకీయ పార్టీల నాయకులు తమకు సహకరించాలని, తమ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలు, బ్యానర్లను తొలగించుకోవాలని కోరారు. వాహనాల్లో రూ.50 వేలకు మించి నగదు, రూ.10 వేలకు మించిన గిఫ్ట్ ఆర్టికల్స్‌ను వెంట తీసుకుని వెళ్లవద్దని సూచించారు. తమ వెంట తీసుకుని వెళ్లే తరుణంలో విధిగా ఆధారాలను ఉంచుకోవాలన్నారు. ఇళ్ల వద్ద ఎగిరే జెండాలకు కూడా అనుమతులు ఉండాలని తెలిపారు. కోడ్‌ను ఉల్లంఘిస్తే కోర్టు కేసులు, జరిమానాలు తదితర చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఈవోఆర్‌డీ ఎ.సుందరి, పంచాయతీ కార్యదర్శి ఎస్ ఠాగూర్, వెంకట్రావు, వీఆర్వో వెజ్జు వినయ్‌కుమార్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

23న ఘంటసాల నాటకం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరానికి చెందిన హిందూ యువజన సంఘం ఆధ్వర్యంలో సురభి కళాకారులచే మధుర గాయకుడు ఘంటసాల జీవిత విశేషాలతో కూడిన ఘంటసాల అనే నాటక ప్రదర్శన ఈ నెల 23న ఏర్పాటు చేసినట్టు ఆ సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యర్రా సోమలింగేశ్వరరావు, కేవీ సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. స్టేషన్ ఘన్‌పూర్‌కు చెందిన శ్రీ సాయి సంతోషి నాట్య మండలి కళాకారులు సురభి సంతోష్ నిర్వహణలో భాస్కరుని సత్య జగదీష్ రచన, దర్శకత్వంలో ఈ నాటకాన్ని ప్రదర్శిస్తారని పేర్కొన్నారు. స్థానిక వైఎంహెచ్ఏ హాలులో శనివారం సాయంత్రం 6.30 గంటలకు నాటకం ప్రారంభమౌతుందని, నగరానికి చెందిన కళాపోషకులు, కళాభిమానులు, ఘంటసాల అభిమానులు ఈ నాటకాన్ని తిలకించి విజయవంతం చేయాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో శ్రీరామునికి అభిషేకాలు


శ్రీరామునికి అభిషేకం చేస్తున్న అర్చకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక రామకోటి ప్రాంగణంలో ఉన్న శ్రీరామాలయంలో పునర్వసు నక్షత్రం పర్వదినం సందర్భంగా మంగళవారం పూజలు చేశారు. ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, నిత్యార్చన నిర్వహించి శ్రీ విష్ణు సహస్రనామ పారాయణ నిర్వహించారు. అనంతరం స్వామి వారికి పంచామృతాలు అభిషేకాలు చేశారు. స్వామి వారికి పువ్వులతో అలంకరణ చేశారు. నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమాలను శ్రీ రామకోటి విశ్వ శాంతి సమాజం అధ్యక్షుడు గాదంశెట్టి రమేష్ కుమార్ పర్యవేక్షించారు.

వాహన తనిఖీలు

జంగారెడ్డిగూడెం: స్టాటస్టిక్ సర్వైవల్ టీమ్ మంగళవారం జంగారెడ్డిగూడెంలో తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని ఎస్సార్ పెట్రోల్ బంక్ వద్ద టీమ్ సభ్యులు పి.బ్యూల, సీహెచ్ రమణ, చిట్టిబాబు వాహన తనిఖీచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల కోడ్‌లో భాగంగా జంగారెడ్డిగూడెం పట్టణ పరిధిలో నియోజకవర్గ రిటర్నింగ్ అఫీసర్, ఆర్డీవో కె.అద్దయ్య ఆదేశాల మేరకు ఈ తనిఖీలు నిర్వహించినట్లు చెప్పారు.